


అభివృద్ధి మాటున చీకటి!



ప్రస్తుతం అవే లైట్లు వెలగడం లేదు..

2020 ఫిబ్రవరిలో కాంతులు విరజిమ్ముతున్న సెంట్రల్ లైటింగ్

- నిర్లక్ష్యపు నీడలో రామప్ప దేవాలయం
- మూణ్నాళ్ల ముచ్చటగా సెంట్రల్ లైటింగ్
- 'బూడిదలో పోసిన పన్నీరు'లా నిధులు
- రూ. కోటి వెచ్చించినా వృథా ప్రయాసే..

వెంకటాపూర్(రామప్ప), జూలై 9: రామప్ప దేవాలయం అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది. యునెస్కో గుర్తింపు పొంది నాలుగేళ్లవుతున్నా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టు ఉంది. ఎలాంటి పురోగతి ఇక్కడ కనిపించడం లేదు. ఆలయంలో అభివృద్ధి అనేది ముందుకు సాగడం లేదు. ముఖ్యంగా రూ. కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలి పోయింది. ప్రధాన ఆర్చ్ నుంచి దేవాలయం వరకు 400 మీటర్ల డబుల్ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఈరోడ్డుపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్స్‌ను 2020 ఫిబ్రవరి 22న ప్రారంభించారు. అందులో 43 లైట్లను ఏర్పాటు చేశారు. అయితే.. అవి మూడునెలలు పనిచేశాయి. ఆ విద్యుద్దీపాల వెలుగులు రామప్పలో కాంతులు నింపాయి. ఆతర్వాత అవి పని చేయకుండాపోయాయి. మరమ్మతులు చేయాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. దీంతో రామప్ప ఆలయ పరిసరాల్లో చీకట్లు అలుముకున్నాయి. నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా వాటిని వెలిగించాలన్న ఆలోచన అధికారులకు తట్టడంలేదు. అభివృద్ధి మాట దేవుడెరుగు.. కనీసం లైట్లను పునరుద్ధరించాలనే ఉద్దేశం వారికి కలగడం లేదు. డబుల్ రోడ్డు కూడా గత వర్షాకాలంలో 400 మీటర్లమేర మధ్యలో తెగిపోయింది. దీంతో స్థానిక ప్రజలే మొరం పోశారు. అయినా అధికారులకు చలనం రాకపోవడం పట్ల పర్యాటకులు, గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రామప్పకు కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తామని చెబుతున్న పాలకులు కూడా పట్టించుకోవడం లేదని అంటున్నారు.



గత వర్షాకాలంలో కోతకు గురైన సీసీ రోడ్డు

అభివృద్ధి.. అంధకారం

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యాటకులను ఆకట్టుకునేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి రామప్ప దేవాలయంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కానీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవన్నీ నిర్వీర్యమవుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. కాంట్రాక్టు పనులు ముగిసిన వెంటనే అభివృద్ధి పనులను స్వాధీనం చేసుకున్న అధికారులు.. వాటి పర్యవేక్షణను గాలికొదిలేస్తున్నారని తెలుస్తోంది. రామప్పలో చేసిన అభివృద్ధి ఫలాలు పర్యాటకులకు అందాలంటే ఉన్నతాధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమించాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. దేవాలయం తూర్పు ముఖద్వారానికి ఒక పక్క అభివృద్ధి పనులు, మరోపక్క అంధకారంలో నీలినీడలు కమ్ముకుంటున్నాయి. కోట్లాది రూపాయలతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్, డబుల్‌రోడ్డు నిర్మాణం వృథా ప్రయాస అవుతోంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ చూపి రామప్ప తూర్పు ముఖద్వారంలో సెంట్రల్ లైటింగ్ పునర్నిర్మాణం చేసి డబుల్‌రోడ్డుకు మరమ్మతు లు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై దృష్టి సారించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

ములుగు కలెక్టరేట్, జూలై 9: వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. ఈమేరకు మంగళవారం ఆమె హైదరాబాద్ నుంచి కలెక్టరేట్‌లో కలెక్టర్ టి.ఎస్.దివాకర, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమం కింద నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో పల్లెప్రకృతి వనాల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. గతంలో నాటిన మొక్కల్లో చనిపోయిన మొక్కలను రీప్లేస్ చేయాలన్నారు. ఇంటింటికీ పంపిణీ చేసే మొక్కల పెంపకం, వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళాశక్తి కార్యక్రమం ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామని, క్యాంటీన్లు, మీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న మీ-సేవ కేంద్రాల్లో వీలైనంత మేర మహిళా సంఘాల సభ్యుల ద్వారా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ముఖ్యమైన ప్రదేశాల్లో మహిళా సంఘాలతో అమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని, మహిళాశక్తి కింద ఇతర వినూత్న కార్యక్రమాలను అమలు చేసేందుకు సలహాలు, సూచనలు ప్రభుత్వానికి అందజేయాలని అన్నారు. అదేవిధంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి చివరి దశ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికీ రెండుజతల దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ పూర్తి చేయాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. విత్తనాల లభ్యత అంశాన్ని కలెక్టర్ ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని సూచించారు. రైతుభరోసా వర్క్‌షాప్‌లను పకడ్బందీగా నిర్వహించాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా కేసుల వ్యాప్తిని అరికట్టాలన్నారు. స్థానిక సంస్థల అధికారులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పెండింగ్ ధరణి దరఖాస్తులను ప్రత్యేకశ్రద్ధతో పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ జిల్లాస్థాయిలో పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీసీవో సర్దార్‌సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు, డీఈవో పాణిని, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు : భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్ : జిల్లాలో యూరియా కొరత లేదని, 25 మెట్రిక్ టన్నుల మేర అందుబాటులో ఉందని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. హైదారాబాద్ నుంచి సీఎస్ శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ పాల్గొన్నారు. వన మహోత్సవం, మహిళాశక్తి, ప్రజాపాలన సహాయ కేంద్రాలు, వ్యవసాయం, సీజనల్ వ్యాధులు, ధరణి, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై సీఎస్ సమీక్షించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడుతూ జిల్లాలో వనమహోత్సం కార్యక్రమం ద్వారా 26.12లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 3.70 లక్షల మొక్కలను నాటినట్టు వివరించారు. ఎనిమిది ప్రాంతాల్లో సంపద వనాలను నాటేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మహిళాశక్తిపై జిల్లా, మండల సమాఖ్యలతో సమావేశాలు ఏర్పాట్లు చేయాలని డీఆర్డీవో నరేశ్‌ను ఆదేశించారు. సిబ్బంది బదిలీల వివరాలను అందించాలన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి



కాళేశ్వరం వద్ద గోదావరిలో వరద నీరు

మహదేవపూర్, జూలై 9 : మండలంలోని కాళేశ్వరం పవిత్ర పుణ్యక్షేత్రం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత గోదావరి పరుగులు పెడుతోంది. ఎగువన ఉన్న మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో వరద నీరు చేరడంతో గోదావరిలో ఉధృతి పెరుగుతోంది. మూడు నెలలుగా గోదావరిలో నీటి శాతం తక్కువగా ఉంది. మహారాష్ట్ర వైపు నుంచి ప్రాణహిత నది ద్వారా వరదనీరు పెద్ద ఎత్తున చేరడంతో గోదావరికి జల కళ సంతరించుకుంది.

సమ్మక్క బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టు వద్ద..

కన్నాయిగూడెం: మండలంలోని తుపాకుల గూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీ, గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద గోదావరి ప్రవాహం మంగళవారం స్వల్పంగా పెరిగింది. ఎగువన కురుస్తున్న వర్షాలతోపాటు సరస్వతి, లక్ష్మీబ్యారేజీల గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతుండటం, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లోంచి ప్రవహిస్తున్న ఇంద్రావతి నది వరద నీరు చేరుతుండటంతో గోదావరి ప్రవాహం క్రమేణా పెరుగుతోంది. ఎగువ నుంచి 53,720 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ఎలాంటి నీటిని నిల్వ చేయకుండా ప్రాజెక్టులోని 52 గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. కొన్ని రోజులుగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద పంపింగ్‌ను నిలిపి వేశారు. బ్యారేజీ వద్ద 73 మీటర్లు, దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 71.60 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

జీపీ బిల్లుల చెల్లింపునకు రూ.50వేల డిమాండ్
అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించిన బాధితుడు
వల పన్ని పట్టుకున్న అధికారులు



కంచనపల్లి కార్యదర్శి పడిగె శివాజీని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు

రఘునాథపల్లి, జూలై 9: నెల నెలా ఠంచన్‌గా వేలల్లో జీతం.. ఆపై అప్పుడప్పుడు దొరికే అమ్యామ్యాలు.. అయినా అతడిలో డబ్బుపై ఆశ చావలేదు. అత్యాశకుపోయి చివరికి ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళితే.. రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామ మాజీ సర్పంచ్ గవ్వాని విజయ భర్త నాగేశ్వరరావు గతంలో జీపీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేశారు. వాటికి సంబంధించి రూ.1.53 లక్షలు జీపీ జనరల్ ఫండ్ నుంచి రావాల్సి ఉంది. అయితే వాటిని చెల్లించేందుకు కార్యదర్శి శివాజీని సంప్రదించగా, రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత కాకుండా రూ.20 వేలు ఇచ్చేందుకు నాగేశ్వర్‌రావు ఒప్పుకున్నారు. ఆ తర్వాత డబ్బుల కోసం పలుమార్లు శివాజీ ఒత్తిడి చేశారు. దీంతో విసుగు చెందిన నాగేశ్వర్‌రావు వరంగల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. డీఎస్పీ సాంబయ్య సూచనల ప్రకారం నాగేశ్వరరావు మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వెనుక ఉన్న చెట్టు వద్దకు వచ్చారు. అక్కడ కార్యదర్శి శివాజీ రూ.20 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకుని శివాజీని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆపరేషన్‌లో వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు శ్యాంసుందర్ రెడ్డి, సట్ల రాజు, ఎల్.రాజు తదితరులు పాల్గొన్నారు.

విసుగొచ్చి ఏసీబీని ఆశ్రయించా..
- గవ్వాని నాగేశ్వరరావు, బాధితుడు



చేసిన పనులకు బిల్లులు చెల్లించేందుకు గ్రామ కార్యదర్శి శివాజీ లంచం డిమాండ్ చేయడం.. ఈ విషయంలో పలుమార్లు ఒత్తిడి తేవడంతో భరించలేక ఏసీబీని ఆశ్రయించా. జూలై 2023 నుంచి చేసిన పనుల కోసం ఖర్చు చేసిన రూ.1.53 లక్షలు జీపీ జనరల్ ఫండ్ నుంచి ఇచ్చేందుకు కార్యదర్శి శివాజీ లంచం అడిగారు. ఏసీబీ అధికారులు అండగా ఉంటామని చెప్పడంతో పంచాయతీ కార్మదర్శిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టించా.

లంచం అడిగితే సమాచారం ఇవ్వండి..

అధికారులు ఏదైన పని కోసం లంచం అడిగితే టోల్‌ఫ్రీ నెంబరు 1064కు సమాచారం ఇవ్వాలని వరంగల్ ఏసీబీ డీఎస్పీ పి.సాంబయ్య సూచించారు. లంచం తీసుకోవడంతో పాటు ఇవ్వడం కూడా నేరమని గుర్తించుకోవాలన్నారు. ఎవరైనా అధికారులు లంచం కోసం వేధిస్తే తమను సంప్రదించాలని కోరారు.

నిధులు దుర్వినియోగం కావద్దు

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్, జూలై 9: ప్రభుత్వం కేటాయించిన నిధులు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంగళవారం సమావేశమయ్యారు. భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షించారు. పనులు చేపట్టకుండానే చెల్లింపులు జరిగిపోయిన నిధులను రికవరీ చేయాలన్నారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. నిధుల కొరత లేదని, ప్రతిపాదనలు పంపితే చర్యలు చేపడతామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో మాట్లాడి నిధులు తీసుకొస్తానన్నారు. బుద్దారం నుచి కోటంచ వరకు రహదారి నిర్మాణానికి రూ.59 కోట్లు, కోటంచ దేవాలయం అభివృద్ధికి సీఎం ప్రత్యేక చొరవతో రూ. 12 కోట్లు మంజూరు చేయించినట్టు తెలిపారు. టేకుమట్ల-రాఘవరెడ్డిపేట మానేరుపై నిర్మిస్తున్న వంతెనను 20 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. రామప్ప నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా గణపురం చెరువుకు నీరు అందించే ప్రాజెక్టుకు భూసేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతుబీమా రెన్యువల్‌పై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వానాకాలంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగులకు స్కూటీలు అందిస్తున్న మంత్రి సీతక్క

- స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ సంకల్పం
- రూ.75 కోట్ల ప్రత్యేక నిధుల కేటాయింపు
- మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే సర్కారు ధ్యేయం
- ఉపకరణాల పంపిణీలో మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, జూలై 9: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. జిల్లాలో మంత్రి మంగలవారం పర్యటించారు. ములుగులోని కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఉపకరణాలు, పదోతరగతి, ఇంటర్‌లో టాపర్లుగా నిలిచిన 43 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా జరిగిన ప్రత్యేక సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.75 కోట్లను కేటాయించిందని తెలిపారు. ఈనిధుల ద్వారా స్వయం ఉపాధి కల్పించడం, ల్యాప్‌టాప్‌లు, ట్రైసైకిళ్లు, స్కూటీలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. వీరికి సంక్షేమంలో, విద్యావిభాగంలో ఐదు శాతం రిజర్వేషన్‌తో ఉపాధి, ఉద్యోగాలు కల్పించడం కోసం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని అభివృద్ధి చెందాలని మంత్రి కోరారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

గ్రామీణ ప్రాంత మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తుందని మంత్రి సీతక్క అన్నారు. ములుగులోని కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఇందిర మహిళాశక్తి క్యాంటీన్‌ను ఆమె మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కలెక్టరేట్, ఏరియా ఆస్పత్రి, ఐటీడీఏ, రామప్ప దేవాలయం ఆవరణలో నాలుగు ఇందిర మహిళాశక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయనున్నామని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ ఏడాది రూ.20వేల కోట్ల రుణాలు బ్యాంకు లింకేజీ ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. మహిళాశక్తి క్యాంటీన్లతోపాటు మహిళామీసేవ కేంద్రాలు, డెయిరీఫామ్‌లో, సోలార్‌లైట్లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సాహం ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. బ్యాంకు రుణాల ద్వారా మహిళలుదేశానికే ఒక బ్రాండ్‌గా నిలవాలని, స్థానిక వనరులు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రానున్న ఐదేళ్లలో అనేకరకాల ప్రోత్సాహకాలు అందించడంతోపాటు వడ్డీలేని రుణ సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ టి.ఎస్.దివాకర, అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, డీఆర్‌డీవో శ్రీనివాస్‌కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనిన, ఓఎస్డీ మధుసూదన్, జిల్లాలోని సీడీపీవోలు, డీసీపీవోలు, జిల్లా అధికారులు ప్రియదర్శిని మహిళా పొదుపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.



మహిళాశక్తి క్యాంటీన్‌లో వంటకాల రుచి చూస్తున్న మంత్రి సీతక్క

ఓపెన్‌జిమ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలి

ఓపెన్‌జిమ్‌ను యువత వినియోగించుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన ఓపెన్‌జిమ్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓపెన్ జిమ్‌ను తన సొంత నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని, యువతీ,యువకులు, మహిళలు, పిల్లలు ఈ వ్యాయామశాలను సద్వినియోగ పరచుకుని ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, అదనపు కలెక్టర్ శ్రీజ, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ములుగు నుంచి పత్తిపల్లి వరకు రూ.6.5కోట్లతో నిర్మించిన రోడ్డును మంత్రి సీతక్క ప్రారంభించారు.

కొనసాగుతున్న ఏఐటీయూసీ రిలే దీక్షలు



సింగరేణి జీఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలో ఏఐటీయూసీ నాయకులు

కాకతీయఖని, జూలై 9: బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలంటూ భూపాలపల్లి ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం నాటికి దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడి బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. బొగ్గు బ్లాకులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోతే సింగరేణి సంస్థ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో భాగంగా బొగ్గు గనులను ఎలాంటి ఆంక్షలు లేకుండా సింగరేణికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాల తిరుపతి, రామ్‌చందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాగులో చిక్కుకున్న యువకులు

సురక్షితంగా తీసుకొచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం



ఎర్రవాగు నుంచి యువకులను బయటకు తీసుకొచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, అధికారులు

మంగపేట, జూలై 9: తమ పంటను పరిశీలించడానికి వెళ్లిన ఇద్దరు యువకులు వాగు అవతల చిక్కుకున్నారు. దీంతో వారిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సురక్షితంగా తీసుకొచ్చింది. ఈ సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురం గ్రామానికి చెందిన దూడపాక దినేష్, దూడపాక రీసన్ రేగులగూడెం శివారున తమ వ్యవసాయ భూమిలో నారమళ్లను పరిశీలించడానికి ఎర్రవాగు దాటి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో భారీ వర్షం కురిసి వాగు ఉప్పొంగింది. దీంతో అవతలి

మిగతా 8వ పేజీలో...

శాంతి భద్రతలే లక్ష్యంగా..

కమిషనరేట్ పరిధిలో సీపీ ప్రత్యేక దృష్టి

రాణాల ఆకస్మిక తనిఖీలు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌పై ఫోకస్



హనుమకొండ స్టేషన్ తనిఖీ చేస్తున్న సీపీ(ఫైల్)



అర్ధరాత్రి సీపీ నగరంలో పెట్రోలింగ్ (ఫైల్)

వరంగల్ క్రైం, జూలై 9: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా సీపీ అంబర్ కిషోర్ ఝా నడుబిగించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంతంగా నిర్వహించిన ఆయన స్టేషన్లలో పోలీస్ అధికారులు అందుబాటులో ఉండాలని గతంలోనే ఆదేశించారు. ఈ క్రమంలో తరచూ పోలీస్‌స్టేసన్లను తనిఖీ చేయడంతో పాటు కమిషనరేట్‌కు వచ్చిన బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నారు. అప్పటికప్పుడు పలు సమస్యలను పరిష్కరిస్తున్న ఆయన పోలీస్ అధికారులపై వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని అటాచ్ చేయడం, స్టేషన్లు మార్చి పోస్టింగ్‌లు ఇస్తున్నారు. గంజాయి, బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు చేపట్టారు. మొత్తంగా గతంలో కమిషనరేట్ పరిధిలో పనిచేసిన అనుభవంతో అంబర్ కిషోర్ ఝా శాంతి భద్రతల పరిరక్షణకు పక్కా ప్రణాళికలతో వెళుతున్నారు.

ఆకస్మిక తనిఖీలతో హడల్

పలు స్టేషన్‌లలో ఎస్‌హెచ్‌వోలు అందుబాటులో ఉండటం లేదని, పిర్యాదులను పెండింగ్‌లో పెడుతున్నారని, బాధితుల పట్ల పోలీసుల ప్రవర్తన బాగోడం లేదన్న ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఆయన కమిషనరేట్ పరిధిలోని స్టేషన్ల తనిఖీ చేపట్టి ఉద్యోగులను హడలెత్తించారు. ఆకస్మిక తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది హాజరు, ఆరోజు వచ్చిన ఫిర్యాదులు, పెండింగ్ కేసుల వివరాలు తదితర విషయాలను పరిశీలిస్తున్నారు. అందుబాటులో ఉండని సిబ్బందికి వార్నింగ్ ఇచ్చారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురు సీఐలు, ఎస్‌ఐలను ఇటీవల అటాచ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే కమిషనరేట్ పరిధిలో అర్ధరాత్రి వేళ హటాత్తుగా రోడ్లపై పెట్రోలింగ్ చేస్తున్నారు. రెండు రోజుల క్రితం అంబర్ కిషోర్ ఝా ట్రై సిటీస్‌లో అర్ధరాత్రి పెట్రోలింగ్ చేసి హడలెత్తించారు. వరంగల్ మండిబజార్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు తనిఖీలు చేసారు. వ్యాపారస్తులు సకాలంలో షాపులు బంద్ చేయాలని సూచించారు. రోడ్లపై వాహనాల తనిఖీలు సైతం చేసిన అంబర్ కిషోర్ ఝా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని అధికారులకు ఆదేశించారు. కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌కు ఆకస్మికంగా వెళ్లిన ఆయన రైల్వేస్టేషన్‌లో తరచూ సంచరించే అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించాలని సూచించారు. కమిషనర్ ఆకస్మిక తనిఖీలతో అధికారులు అప్రమత్తమయ్యారు. స్టేషన్లలో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉన్నట్టు కనిపిస్తోంది.

ట్రాఫిక్‌పై ప్రత్యేక శ్రద్ధ

కాగా శాంతి భద్రతలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన అంబర్ కిషోర్ ట్రాఫిక్ నియంత్రణకు కూడా చర్యలు చేపట్టారు. నయీంనగర్ నాలా పనులు జరుగుతుండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయించడంతో పాటు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులను నియమించారు. మర్కజీ పాఠశాల జంక్షన్ వద్ద డివైడర్లతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదు అందడంతో స్వయంగా వెళ్లిన పోలీస్ కమిషనర్ వెంటనే డివైడర్‌ను తొలగించి సమస్యకు పరిష్కారం చూపి.. నూతన సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసారు. వాహనాల తనిఖీలు చేపట్టి పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించడం, వాహనాలు సీజ్ చేయాలని ట్రాఫిక్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరం

ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్

సుబేదారి, జూలై 9: యుద్ధాలు మానవాళి మనుగడకు ప్రమాదకరమని ఎంసీపీఐ (యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ రెండు రోజుల సమావేశాలు హనుమకొండ సుబేదారిలోని రాఘవేంద్ర గార్డెన్స్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దారపు రమేష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. సమావేశంలో తొలుత పాలస్తీనా, గాజాపై ఇజ్రాయిల్ దేశం సాగిస్తున్న నరమేధంలో, ఉక్రెయిన్, రష్యా దాడుల్లో మరణించిన వారికి, ఇటీవల వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన వారికి, ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు, నిరుద్యోగులకు, హత్రాస్ తొక్కిసలాటలో మరణించిన వారికి మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మద్దికాయల అశోక్ మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి సౌభ్రాతృత్వం నెలకొల్పి శాంతియుత సహజీవనం కొనసాగించాల్సిన ప్రపంచ దేశాల్లో అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాలు ఇతర దేశాల సార్వభౌమాధికారంలో జోక్యం చేసుకుంటున్నాయని అన్నారు. సమావేశంలో ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కుంభం సుకన్య, వస్కుల మట్టయ్య, వనం సుధాకర్, గోనె కుమారస్వామి, ఎన్‌రెడ్డి హంసారెడ్డి, మంద రవి, నాగార్జున పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

కాజీపేట, జూలై 9 : మున్సిపల్ కార్పొరేషన్‌లో విధినిర్వహణలో మృతి చెందిన పారిశుధ్య కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబీకులకు వెంటనే ఉద్యోగాలు కేటాయించాలని, కార్పొరేషన్ ప్రకటించిన రూ 1 లక్ష 50 వేలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మినీ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ సిబ్బంది, సీఐటీయూ నాయకులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టి.ఉప్పలయ్య మాట్లాడారు. మున్సిపాలిటీలో ఔట్‌సోర్సి ంగ్‌లో పనిచేస్తూ మరణించిన కార్మిక కుటుంబాలకు కార్పొరేషన్ తీవ్ర అన్యాయానికి గురుచేస్తుందన్నారు. మృతుల కుటుంబీకుల ఉద్యోగాలు ఇవ్వాల్సిన కార్పొరేషన్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. కార్మిక కుటుంబాలు కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, జూలై 9 : యువత మత్తుకు బానిస కావొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆచార్య రవి రూపొందించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం సీపీ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో యువత భవి ష్యత్ నాశనం కావడమే కాకుండా ఎన్నో కుటుంబాలు ఛిద్రం అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండి జీవితంలో ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని సూచించారు.

జడ్పీలో బదిలీల ప్రక్రియ షురూ

హనుమకొండ సిటీ, జూలై 9 : జిల్లా పరిషత్‌లో బదిలీల ప్రక్రియ ఆరంభమైంది. అన్ని విభాగాల ఉద్యోగుల బదిలీ ప్రక్రియను అధికా రికంగా చేపట్టారు. ఇందులో భాగంగా ఉద్యోగుల నుంచి ఆగస్టు 12 వర కు బదిలీ దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు. బదిలీలు జరుగ నుండడంతో జడ్పీలో ఉద్యోగుల సందడి నెలకొంది.

ఎంజీఎంలో డీఎంహెచ్‌వో తనిఖీ

వరంగల్ మెడికల్, జూలై 9 : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 6వ తేదీన జిల్లా కలెక్టర్ ఎంజీఎం ఆస్పత్రిని తనిఖీ చేసిన సందర్భంలో ఆదేశించిన విధంగా ఆస్పత్రిలో స్టార్టింగ్ ఓపీ, సీసీ కెమెరాలు ఏర్పాటు, ఓసీలో కుర్చీల ఏర్పాటు తదితరాలపై తనిఖీ చేశారు. అనంతరం ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి మాట్లాడిన అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందజేసినట్లు తెలిసింది.

కేయూ ఇంజనీరింగ్ డీన్ బదిలీ

కేయూ క్యాంపస్, జూలై 9: కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం డీన్, కేయూ మహిళ, కో ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందంను వర్సిటీ కళాశాల నుంచి కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కేయూ ఉన్నతాధికారులు సదానందంను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. సదానందం బదిలీతో వర్సిటీ క్యాంపస్‌లోని రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు తాత్కాలికంగా ఇద్దరూ అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు తెలిసింది. అయితే ప్రొఫెసర్ సదానందం తన తమ్ముడికి ఆరోగ్యం బాగా లేదని బదిలీ తాత్కాలికంగా అపాలని వర్సిటీ ఉన్నతాధికారులను కలిసి విన్నవించినట్లు తెలిసింది. తక్షణమే వర్సిటీ కళాశాల నంచి రీలివై కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో జాయిన్ కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది.

ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

యుఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్‌నాయక్

హనుమకొండ టౌన్, జూలై 9 : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేశ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం లష్కర్ బజార్‌లోని ప్రాక్టిసింగ్ ప్రైమరీ పాఠశాల, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులు ఎదుర్కొం టున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భరంగా రాజేశ్‌నాయక్ మాట్లాడుతూ.. పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, స్కావెంజర్స్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నార న్నారు. జిల్లా అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు అధ్యాయనం చేసి పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. పూర్తి స్థాయి ఉపాధ్యాయులు లేక, ఇన్‌చార్జి హెచ్‌ఎంలతో విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని వెంటనే సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌ఎఫ్ఐ టౌన్ సెక్రెటరీ హరీశ్, జిల్లా నాయకులు రాజేశ్, రాకేశ్, శివ పాల్గొన్నారు.

భార్యను చంపి భర్త ఆత్మహత్య

- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణం
- ముగ్గురు పిల్లల్ని బావమరిది ఇంటికి పంపి దుశ్చర్య
- తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో చిన్నారులు
- సోమవారం రాత్రి దారుణం.. మంగళవారం ఉదయం వెలుగులోకి
- కంటతడి పెట్టించిన చిన్నారుల రోదన
- వరంగల్‌లోని చెన్నారెడ్డినగర్‌లో విషాదం


స్వప్న మృతదేహం


బిక్కుబిక్కుమంటూ ఉన్న ముగ్గురు పిల్లలు

ఖిలావరంగల్, జూలై 9: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు ఆ ఇంట్లో చిచ్చురేపాయి.. దీంతో జీవితంపై విరక్తి చెందిన భర్త భార్యను చంపి.. ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆ తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషాదకర ఘటన వరంగల్ నగరంలోని 18వ డివిజన్ చెన్నారెడ్డి కాలనీలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చెన్నారెడ్డికాలనీకి చెందిన మంద చరణ్ (45), మంద స్వప్న(40) దంపతులకు 18ఏళ్ల క్రితం వివాహం జరగ్గా, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు జన్మించారు. కుమారుడు అంధత్వంతో బాధపడుతుండగా చరణ్ భవన నిర్మాణ మేస్త్రీగా, స్వప్న కూరగాయల మార్కెట్‌లో కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కానీ కొద్దిరోజుల నుంచి చరణ్, స్వప్న దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. వాటికి ఆర్థిక ఇబ్బందులు కూడా తోడయ్యాయి. ఈ క్రమంలోనే సోమవారం సాయంత్రం చరణ్ తన ముగ్గురు పిల్లలను వరంగల్‌లోని ఉర్సు ప్రాంతంలో నివాసం ఉండే తన బావమరిది ఇంట్లో దింపేసి వచ్చాడు. రాత్రి ఇంట్లో చరణ్, స్వప్న దంపతులు మాత్రమే ఉండగా రాత్రివేళ ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో ఆగ్రహావేశానికి లోనైన చరణ్ రోకలి బండతో స్వప్నపై దాడి చేయడంతో తలకు బలమైన గాయమై స్వప్న మృతి చెందింది. ఆమె చనిపోయినట్టు నిర్ధారించుకున్నాక అప్పటికే తాను తెచ్చుకున్న పురుగుల మందును తాగి చరణ్ ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం తమ మామయ్య ఇంటి నుంచి ఆటోలో తిరిగి వచ్చిన ముగ్గురు పిల్లలు తల్లి రక్తపు మడుగులో, తండ్రి విగతజీవిగా కనిపించడంతో భయంతో బిగ్గరగా కేకలు వేస్తూ ఏడ్చారు. చిన్నారుల ఏడుపు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని 100కి డయల్ చేసి సమాచారమివ్వగా మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు మార్చురీకి తరలించారు. మృతుడి పెద్ద కుమార్తె గ్రేసి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

దిక్కుతోచని స్థితిలో చిన్నారులు..

తల్లిదండ్రులు కోల్పోయిన ముగ్గురు పిల్లలు దిక్కుతోచని స్థితిలో మిగిలారు. పెద్దకుమార్తె గ్రేసీ ఏడో తరగతి వరకు చదువుని ఇంట్లోనే ఉంటోంది. చిన్న కుమార్తె మెర్సీ గుండెకు రంధ్రం ఉండటంతో ఆపరేషన్ చేయించే పరిస్థితి లేక తరచూ అనారోగ్యంతో బాధపడుతూ ఆమె కూడా స్కూల్‌కు వెళ్లడం లేదు. ఇక ఒక్కగానొక్క కుమారుడు శాలూమ్ కూడా అంధుడు కావడంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. తమ కుటుంబ దీన స్థితికి తోడు ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడం, ఈ క్రమంలోనే భార్యాభర్తల మధ్య కలహాలు ప్రారంభం కావడంతో ఆత్మస్థైర్యం కోల్పోయి, జీవితంపై విరక్తితో చరణ్ ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటాడని బంధువులు, స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

కంటతడిపెట్టించి చిన్నారుల రోదన

తమ మామయ్య ఇంటి నుంచి ఆనందంగా ఇంటికి వచ్చిన గ్రేసీ, మెర్సీ, శాలూమ్ ఇంటి తలుపు తీయగా తల్లిదండ్రులు చనిపోయి కనిపించడంతో కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడివారిని కంటతడి పెట్టించింది. ఇంటిముందు నిలబడి 'అమ్మా..నాన్నా..' అంటూ విలపించడం అక్కడి వారిని కలిచివేసింది.

ఔదార్యం చాటుకున్న పోలీసులు

కరీమాబాద్ : మిల్స్‌కాలనీ పోలీసులు ఔదార్యాన్ని చాటుకున్నారు. లేబర్‌కాలనీకి చెందిన మంద చరణ్-స్వప్న దంపతులు మృతిచెందడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ముగ్గురు చిన్నారులను చూసి చలించిపోయారు. ముఖ్యంగా శాలూమ్ అంధుడు కావడంతో స్పందించిన సీఐ మల్లయ్య రూ.10వేలు, ఎస్సైలు చందర్, శ్రీకాంత్ రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. అలాగే 18వ డివిజన్ కార్పొరేటర్ వస్కుల బాబు, కాంగ్రెస్ నాయకుడు గడ్డమీది రాజేష్ రూ.5వేలు, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ రూ. 5వేలు అందించి మానవత్వంచాటుకున్నారు.

భక్తిశ్రద్ధలతో సీత్లా పండుగ

ప్రత్యేక పూజలు చేసిన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్


మహబూబాబాద్ శివారు వీరారంతండా సీత్లాపండుగ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూలై 9 : మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం గిరిజనులు సీత్లా పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. యావత్ గిరిజన జాతిమొత్తం ఒకేరోజు పండుగను ఆనందోత్సవాల నడుమ నిర్వహించుకున్నారు. సీత్లాభవాని ఘాట్ వద్దకు గిరిజన మహిళలు సంప్రదాయబద్ధంగా నైవేద్యాలు (పాయసం)తో పాటు ప్రత్యేక వంటకాలు చేసుకుని సీత్లాభవాని అమ్మవారికి సమర్పించారు. ఆట, పాటలతో నృత్యాలు చేస్తూ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ప్రతీ గిరిజన తండాల్లో చిన్నాపెద్ద అనే తారతమ్యం లేకుండా ఈ వేడుకల్లో పాల్గొని, ప్రకృతిని ఆరాధిస్తూ కులదేవతను పూజించారు.

- మహబూబాబాద్ శివారు వీరారంతండాలో నిర్వహించిన వేడుకల్లో సీత్లాభవాని అమ్మవారికి స్థానిక శాసన సభ్యులు భూక్య మురళీనాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను, డాక్టర్ బానోత్ నెహ్రూరాథోడ్ పాల్గొన్నారు. గుండ్లబోడుతండాలో నిర్వహించిన వేడుకల్లో సేవాలాల్ సేనా రాష్ట్ర కోకన్వీనర్ వెంకన్ననాయక్, నాయకులు మోతీలాల్, బన్సీలాల్, శంకర్, బాలు,చంద్రు, లింగన్న, రవి, భద్రు, మాలు, సంజీవ, శ్రీను, రమేష్, మంగిలాల్, సరిత, మౌనికబాయి, మీనా, శారద, సునీత పాల్గొన్నారు. వినాయకతండాలో సీత్లాపండుగను పురస్కరించుకుని సీత్లాభవానికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ శంకర్‌నాయక్, దారావత్ హంక్లా, బానోత్ సక్రాం, సురేష్, విజయ్, రమేష్, బిచ్యా, వస్రాం పాల్గొన్నారు.


మహబూబాబాద్ వినాయక తండాలో సీత్లాభవానికి నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న తండవాసులు

వివిధ మండలాల్లో..

మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని బోడ అమృతండ, సబ్‌స్టేషన్‌తండ, లోక్యతండ, జామతండ, అర్లగడ్డతండ, సేతావత్‌తండ, లూనావత్‌తండతో అన్ని గిరిజన గూడాల్లో సీత్లాపండగ వేడుకలు నిర్వహించారు.

- దంతాలపల్లి మండలంలోని తూర్పుతండ, దుబ్బతండ, రెక్యతండాలో గిరిజనులు సీత్లాభవాని పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అంజి, నాయకులు పాల్గొన్నారు.
- గూడూరు మండలం సీతానగరం శివారు రాళ్లవాగు దస్రు తండ, ఏపూరు గ్రామాల్లో సీత్లా భవాని వేడుకలు నిర్వహించారు. భూక్య మంగీలాల్, లక్ష్మణ్, వాంకుడోతు గోపినాథ్, వాంకుడోతు మోతీలాల్, శ్రీను, రమేష్, సురేష్, బిచ్చు, సర్దార్, బాబు, రాములు, వెంకటేష్, గోపిచంద్ పాల్గొన్నారు.
- బయ్యారం మండలంలోని అన్ని లంబాడ గిరిజన తండాల్లో, గూడాల్లో సీత్లాభవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తండా పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
- చిన్నగూడూరు మండలం మేగ్యతండాలో నిర్వహించిన వేడుకల్లో తండాపెద్ద బాదావత్ రెడ్డి, బాను, చంద్రు, సురేష్, జ్యోతిరాము, భూక్య వెంకన్న, చిరంజీవి, రాంబాబు, శంకర్, శివ, సాయిరాం, రవి, మల్లేశ్వర్, దస్రూ పాల్గొన్నారు.
- సీరోలు మండలం కాంపల్లి సక్రాంనాయక్‌తండాలో నిర్వహించిన వేడుకల్లో తేజావత్ రవీందర్, బిచ్చు, ఈశ్వర్, సేట్యా బానోత్ వీరన్న, తేజావత్ వీరన్న, నరేష్, రాములు, సతీష్ పాల్గొన్నారు.
- పెద్దవంగర మండలంలో సీత్లాభవాని వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలలో పాల్గొని నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పానుగోతు ప్రదీప్‌నాయక్, రఘులాల్‌నాయక్, రామచంద్రు, అమర్‌సింగ్, ధూమా, ప్రవీణ్, కల్యాణి, మంగమ్మ, మహిళలు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 9 : వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వరంగల్‌లోని దేశాయిపేట సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి టూ-డే క్రికెట్ లీగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూలై రెండవ వారం నుంచి హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్న టూ-డే క్రికెట్ లీగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. 25 సంవత్సరాల వయస్సు లోపు, 31 ఆగస్టు 1999 సంవత్సరం తర్వాత పుట్టిన ఔత్సాహిక క్రికెట్ క్రీడాకారులు అర్హులను తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈనెల 11న ఉదయం 10గం టలకు సీకేఎం కళాశాల క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని శ్రీనివాస్ వెల్లడించారు. మరిన్ని వివరాలకు-98495 70979 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

హనుమకొండ ఎఫ్ఏసీ డీఈవోగా వాసంతి

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 9 : హనుమకొండ జిల్లా విద్యాశాఖాధికారిగా డి. వాసంతికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న డాక్టర్ ఎండి. అబ్దుల్ హై అనారోగ్యానికి గురికావడంతో ఆయన రెండు నెలల పాటు సెలవు పెట్టారు. దీంతో వరంగల్ ఎఫ్ఏసీ డీఈవోగా పనిచేస్తున్న డి.వాసంతికి హనుమకొండ బాధ్యతలు అప్పగించారు.

అడవి బిడ్డలకు అక్షరాభ్యాసం

- గొత్తికోయగూడెంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు
- ప్రారంభించిన మంత్రి సీతక్క
- చిన్నారి తులసి కోరిక మేరకే నిర్మించామని వెల్లడి


స్కూల్ భవనం ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మేడారం, జూలై 9: మారుమూల అటవీ ప్రాంతంలో.. గొత్తికోయ బిడ్డలు చదువుకొనేలా మంత్రి సీతక్క చూపిన చొరవ చూపడంతో సర్కారు పాఠశాల ప్రారంభమైంది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం నార్లాపూర్ పంచాయతీ పరిధి గొత్తికోయగూడెమైన తక్కెళ్లపల్లి గూడేనికి చెందిన చిన్నారి పూణెం తులసి ఆ కార్యక్రమంలో నాటిక ప్రదర్శన ఇవ్వగా.. ఆమె ప్రదర్శనను మెచ్చిన మంత్రి సీతక్క 'నీకేం కావాలి తల్లీ' అని ఆ చిన్నారిని సీతక్క అడగ్గా 'మా గ్రామానికి పాఠశాల కావాలి' అని ఆ చిన్నారి టక్కున సమాధానం ఇచ్చింది. అందుకు మంత్రి స్పందించి పాఠశాల నిర్మాణానికి ముందడుగు వేశారు. దాతల ఆర్థిక సహకారం, పోలీసు శాఖ పర్యవేక్షణలో నిర్మితమైన ఆ పాఠశాల భవనం మంత్రి సీతక్క చేతుల మీదుగా మంగళవారం ప్రారంభమైంది. ములుగు ఎస్పీ శబరీశ్, ఓఎస్డీ మహేష్ గీతెతో కలిసి మంత్రి తాక్కెళ్లగూడెం గొత్తికోయగుంపులో పాఠశాల భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారి పూణెం తులసి కోరిక మేరకే గ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. నీకేం కావాలని అడగ్గానే తమ గ్రామానికి పాఠశాల కావాలని ఆ చిన్నారి చెప్పడం తననెంతో ప్రభావితం చేసిందని మంత్రి ఆనందాన్ని వ్యక్తం చేశారు. గూడెంలో పాఠశాలను నిర్మించాల్సిన ఆవశ్యకతను ఎస్పీ శబరీశ్‌కు వివరించానన్నారు. అటవీ శాఖ అనుమతులతో 15 రోజుల్లో రూ.8.5లక్షలతో భవన నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. దీనికి డాక్టర్ తరుణ్‌రెడ్డి రూ.1.50లక్షలు ఆర్థిక సాయం అందించగా రూ.3లక్షలు ఎస్పీ సమకూర్చారని, కలెక్టర్ నిధుల నుంచి రూ.4లక్షలు కేటాయించారని వివరించారు. తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డితో పాటుగా శ్రమించిన తాడ్వాయి పోలీసు బృందాన్ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ 31కుటుంబాలు ఉన్న తక్కెళ్లగూడెం ప్రజల జీవితాల్లో అక్షర వెలుగులు నింపడానికి ఈ పాఠశాల దోహదపడుతుందన్నారు. పిల్లలే కాకుండా పెద్దలు కూడా ఖాళీ సమయంలో అక్షరాభ్యాసం చేయాలని సూచిం చారు. అలాగే గూడెం వాసులకు హనుమకొండలోని చక్రవర్తి హాస్పిటల్‌లో ఉచితంగా వైద్య సేవలు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క చేతుల మీదు గా గొత్తికోయ పిల్లలకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాం పంపిణీ చేశారు.

గూడెంలో మంత్రి పుట్టిన రోజు వేడుకలు

ఎస్పీ శబరీశ్ ఆధ్వర్యంలో తక్కెళ్లగూడెంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు జరిగాయి. గూడెం వాసులతో కలిసి కేక్ కట్ చేసిన సీతక్క పిల్లలకు, పెద్దలకు, పోలీసులకు, కార్యకర్తలకు పంచారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, సీఐ జి.రవీందర్, పోలీసులు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

- ఇల్లు అమ్మినా తీరని ఆర్థిక ఇబ్బందులు
- భీమదేవరపల్లి మండలం వంగరలో విషాదం


సునీత మృతదేహం

భీమదేవరపల్లి, జూలై 9 : వారికి ఎలాంటి వ్యవసాయ భూమి లేదు. భార్యభర్త ఇద్దరూ కష్టపడి పనిచేసుకునేవారు. ఈ క్రమంలోనే ఆ మహిళ కౌలు రైతుగా మారింది. నాలుగెకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకొని భర్తతో కలిసి పంటలు సాగు చేసింది. అలాగే తన కూతురు వివాహం కూడా చేసింది. కానీ గతేడాది వర్షాలు కురవకపోవడంతో పత్తి, వరి పంటలు ఎండిపోయి ఆ దంపతులు తీవ్ర నష్టాల పాలయ్యారు. అటు పంట పెట్టుబడులు.. ఇటు కూతరు వివాహం కోసం చేసిన అప్పులు మొత్తం రూ. 15లక్షలయ్యాయి. చివరకు ఆ అప్పు తీర్చే దారిలేక తమ సొంత ఇంటిని అమ్మారు. అయినా ఆర్థిక సమస్యకు పరిష్కారం దొరకలేదు. దీంతో దంపతులిద్దరూ తీవ్ర మనోవేదనలో ఉన్నారు. ఈ క్రమంలోనే ధైర్యం చెడిన ఆ ఇల్లాలు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాద సంఘటన భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో జరిగింది. వంగర ఎస్ఐ నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం వంగర గ్రామానికి చెందిన ఏలూరి సునీత(40), శ్రీనివాస్‌రెడ్డి దంపతులకు కూతురు, కుమారుడు ఉన్నారు. ఎలాంటి వ్యవసాయ భూమి లేకపోవడంతో వారు నాలుగెకరాల భూమిని కౌలు తీసుకొని గతేడాది పత్తి, వరి పంటలు వేశారు. కానీ తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటలు పూర్తిగా ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోవడంతో భూమి యజమానికి చెల్లించాల్సిన కౌలు డబ్బులు, పెట్టుబడిగా తెచ్చిన అప్పులు మరింత భారంగా మారాయి. అలాగే అదే ఏడాది కూతురు వివాహం కూడా చేయడంతో వారు చేసిన అప్పులు రూ.15లక్షలయ్యాయి. ఇటీవల అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిళ్లు పెరగడంతో గత్యంతరం లేక తాము నివసిస్తున్న ఇంటిని రూ.7లక్షలకు విక్రయించి అప్పులు చెల్లించగా.. మరో రూ.8లక్షలు తీర్చే దారిలేకుండా పోయింది. ఇదే మనోవేదనలో భార్యభర్తలిద్దరూ ఉండగా మంగళవారం తెల్లవారు జామున సునీత ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగింది. ఉదయం సమయంలో నిద్రలేచిన భర్త శ్రీనివాస్‌రెడ్డి సునీత అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. సునీత మృతితో వంగరలో విషాద ఛాయలు అలముకోగా.. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. భర్త శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

సందడిగా జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపికలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరైన 40 మంది క్రీడాకారులు


జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో స్విమ్మింగ్ అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 9 : వరంగల్ జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ ఎంపిక పోటీలు మంగళవారం సందడిగా ప్రారంభమయ్యాయి. సబ్‌జూనియర్స్, జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన పోటీలలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 40మంది బాలబాలికలు పాల్గొనడం జరిగిందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి స్వామిచరణ్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఫ్రీస్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్ బటర్‌ఫ్లై, ఇండివిజల్ మిడ్‌లే విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 13, 14 తేదీలలో సికింద్రాబాద్‌లోని జీహెచ్ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల సబ్‌జూ నియర్స్ జూనియర్స్ బాలబాలికల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ సునీల్‌రెడ్డి, అధ్యక్షుడు కందు కూరి రాజేంద్రప్రసాద్, సభ్యులు కందుకూరి సంజయ్‌కృష్ణ, డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా.. గోరింట

- ఆషాఢంలో మహిళల ఆభరణం
- పలు వ్యాధులకు చక్కని ఔషధం



బచ్చన్నపేట, జూలై 9: ఆషాడం అనగానే మహిళలకు గుర్తుకు వచ్చేది గోరింటాకు. చిన్నారుల నుంచి వయస్సు పైబడిన మహిళలు సైతం గోరింటాకును పెట్టుకోవటానికి ఇష్టపడతారు. వివాహాలు, శుభకార్యాలు రాగానే తొలుత గోరింటాకుకు ప్రాధాన్యతనిస్తారు. ఆషాఢ మాసంలో లేత గోరింటాకులను మెత్తగా రుబ్బి పెట్టుకుంటే బాగా పండుతుందంటారు. గోరింటాకు శాస్త్రీయ నామం లోసోనియా ఇన్నెర్‌మిస్. దీనికి అరబిక్ పేరు హెన్నా. మెహందీగా ఇది సుప్రసిద్ధం. గోరింటాకు వేల ఏళ్ల నాటి నుంచి వాడుకలో ఉందని చెబుతారు. ఇది అలంకరణ కోసమే కాకుండా ఔషధంగా కూడా పనికొస్తుందని నమ్ముతారు. ఆకులను మెత్తగా రుబ్బి ఇందులో కాస్త చింతపండు, పెరుగు కలుపుతారు. అలా తయారైన గోరింటాకు చూర్ణాన్ని చేతులు, పాదాలపైనా మహిళలు పలు రకాల డిజైన్లలో పెట్టుకుంటారు. ఈ గోరింటాకులో హన్నోటిక్ ఆమ్లం ఉంటుంది. ఇది చర్మంలోని కొల్లాజిల్ అనే రసాయనంతోనూ, వేలిగోళ్లు, వెంట్రుకల్లో ఉండే కెరాటిన్‌తో బంధం ఏర్పర్చుకోవడంతో ఎర్రగా పండుతుంది. గోరింటాకు గోరింటాకు పువ్వు, ఆకులు, వేర్లు, విత్తనాలను చూర్ణంగా చేసుకుని పెట్టుకోవడం ద్వారా పలు రకాల చర్మ వ్యాధులు, వెంట్రుకలు రాలకుండా ఉండేందుకు, చుండ్రు తొలగించేందుకు, కేశాలంకరణకు ఔషధంగా ఉపయోగిస్తారు.

ఆయుర్వేద, ప్రకృతి వైద్య నిపుణులు చెప్పే ఉపయోగాల్లో కొన్ని..

గోరింటాకు అలంకరణకు, అందానికి మాత్రమే కాకుండా ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణలు చెబుతారు. జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి శరీరానికి గోరంటాకు పూయటం వల్ల శరీర ఉష్ణోగ్రత అదుపులోకి వస్తుందని, బాగా నూరిన గోరింటాకును నొప్పిగా ఉన్న కీళ్లపై పెట్టి కట్టు కట్టడం ద్వారా అదుపు చేయవచ్చని చెబుతున్నారు. గోరింటాకును వెనిగర్, నిమ్మరసంతో కలిపిన మిశ్రమాన్ని అనారోగ్యం ద్వారా వచ్చే పాదాల మంటలను అరికట్టేందుకు వాడుతారని, నోటిపూతతో బాధపడేవారు గోరింటాకు కషాయం నోటిలో వేసుకుని పుక్కిలిస్తే తగిన ఫలితం కనిపిస్తుందంటున్నారు. ఇక గోరింటాకు యాంటీబయోటిక్ లక్షణాలను కలిగి ఉండటం మూలంగా కాళ్లకు, చేతులకు పెట్టుకోవడం ద్వారా క్రిములు దరిచేరకుండా ఉంటాయని, దీని నుంచి ఉత్పత్తయ్యే లాసోస్ అనే రంగు పదార్థం సూక్ష్మజీవులను నశింపజేస్తుందని పేర్కొంటున్నారు. గోరింటాకు పువ్వులు సుఖనిద్రను పెంచి తలనొప్పిని దూరం చేయడానికి ఉపయోగపడతాయని, గోరింట చెట్టు బెరడు పచ్చకామెర్లకు, కాలేయ వాపు తీవ్రత తగ్గించడానికి వినియోగిస్తారని, లేత గోరింట పండ్ల నుంచి తయారు చేసిన చూర్ణం శరీరంపై వచ్చే దురదను అదుపు చేస్తుందని చెబుతున్నారు.





గూడూరు అడవిలో నెమలి సంచారం


గూడూరు అటవీప్రాంతంలో సంచరిస్తున్న నెమలి

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 9 : గూడూరు శివారు చంద్రుగూడెం అటవీ ప్రాంతంలో మంగళవారం జాతీయపక్షి నెమలి సంచారం కన్పించింది. అటవీ శాఖ అధికారుల ర క్షణ చర్యల్లో భాగంగా వన్యప్రాణులు, పక్షులు సంచారం ఎక్కువగా కన్పిస్తోంది. తాజాగా చంద్రుగూడెం అటవీప్రాంతంలో నెమలి కన్పించడంతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

వినూత్న వైద్య సేవలు

- ఏజెన్సీ ప్రాంత గిరిజనుల కోసం కంటైనర్ ఆస్పత్రి
- నేటినుంచి అందుబాటులోకి..

తాడ్వాయి, జూలై 9: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని పోసాపూర్‌లో కంటైనర్ ఆస్పత్రి ఏర్పాటైంది. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు అత్యాధునికంగా వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ములుగు కలెక్టర్ టి.ఎస్.దివాకర, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య ఆధ్వర్యంలో దీనిని అందుబాటులోకి తెస్తున్నారు. వర్షాకాలంలో తాడ్వాయి మండలంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో గల బందాల, పోసాపూర్, అల్లిగూడెం, నర్సాపూర్, బొల్లెపల్లి, తదితర గ్రామాలకు వరదల కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈప్రాంత గిరిజనులకు వైద్యసేవలకు సైతం ఆటంకం కలుగుతోంది. గతంలో పలువురు అనారోగ్యాలతో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. వర్షాకాలంలో వైద్యబృందం ఆ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఈక్రమంలో ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఒక కంటైనర్‌లో నాలుగు బెడ్లు ఏర్పాటు చేసి వైద్యసేవలతోపాటు సుఖ ప్రసవాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. అత్యవసర చికిత్సలు అందించేందుకు వైద్యబృందం నాలుగు నెలలపాటు సిద్ధంగా ఉంటారు. ఈ సీజన్‌లో వివిధరకాల రోగాలకు రక్తనమూనాలు సేకరించి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తారు. ఈ అదనపు ఆస్పత్రిలో ఒక వైద్యాధికారితోపాటు ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సు, ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటారు. కలెక్టర్ ప్రత్యేక చొరవతో కంటైనర్ ఆరోగ్య ఉపకేంద్రాన్ని సుమారు రూ.7లక్షల వ్యయంతో హైదరాబాద్‌లో రూపొందించి పోసాపూర్‌కు తరలించి సిద్ధంగా ఉంచారు. దీనిపై ఏజెన్సీ ప్రాంత గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




పోసాపూర్‌లో ఏర్పాటుచేసిన కంటైనర్ ఆస్పత్రి. ఆస్పత్రిలో బెడ్లను ఏర్పాటు చేసిన సిబ్బంది

మంత్రి సీతక్క విస్తృత పర్యటన


ములుగు మండలం ఇంచర్లలో గజమాలతో సీతక్కను సన్మానిస్తున్న కాంగ్రెస్ నేతలు


రక్తంతో గీయించిన చిత్ర పటాన్ని సీతక్కకు బహూకరిస్తున్న సుమన్‌రెడ్డి

ములుగు రూరల్ జూలై 9: మంత్రి సీతక్క జిల్లాలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినులకు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ దివాకరతో కలిసి సైకిళ్ల పంపిణీ చేశారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, డీఈవో పాణిని, సైన్స్ జిల్లా అధికారి జయదేవ్, ప్రధానోపాధ్యాయులు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు. ములుగు మండలం ఇంచర్లలో ఎంఆర్ గార్డెన్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆధ్వర్యంలో సీతక్క జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా నాయకులు ఆమెను గజమాలతో సత్కరించారు. సీతక్క కేక్ కట్ చేశారు. అనం తరం ఎంపీ బలరాం నాయక్‌ను శాలువాతో సన్మానించారు.

సైకిళ్ల పంపిణీ

మంగపేట: జిల్లాస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండలంలోని విద్యార్థినులకు మంత్రి సీతక్క ములుగు మండలం ఇంచర్లలో సైకిల్స్ బహూకరించారు. మంగపేటలోని ఎక్కటి సరోజిని శేషారెడ్డి ప్రభుత్వ కళాశాలకు చెందిన షేక్ సనా ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 967 మార్కులు సాధించగా మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటయ్యతోపాటు అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తంతో సీతక్క చిత్రపటం

వెంకటాపూర్(రామప్ప): మంత్రి సీతక్కపై మండలంలోని రామాంజాపూర్ గ్రామానికి చెందిన జిల్లా యువజన కాంగ్రెస్ మారం సుమన్‌రెడ్డి వీరాభిమానాన్ని కనబర్చారు. తన రక్తంతో ఆమె చిత్రపటాన్ని చిత్రీకరించి బహూకరించారు. సీతక్క జన్మదినం సందర్భంగా అందజేశారు. యువజన కాంగ్రెస్‌లో క్రియాశీలంగా పనిచేస్తూ తన వీరాభిమాన్ని చాటుకున్న సందర్భంగా పలువురు సుమన్‌రెడ్డిని ప్రశంసించారు.

101 కొబ్బరికాయలు కొట్టి..

ఎమ్మెల్యేగా గెలిచి సీతక్క మంత్రి పదవి చేపడితే 101 కొబ్బరికాయలు కొట్టి దేవుడి రుణం తీర్చుకుంటా అని ప్రతీనబూనిన కాంగ్రెస్ నాయకుడు పరికిరాల సాంబయ్య శ్రీసీతరామాంజనేయస్వామి ఆలయంలో తన మొక్కును తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మిలుకూరి ఐలయ్య, జంగిలి రవియాదవ్, చేన్నోజు శ్రీనివాస్, రాజిరెడ్డి, రాజు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మంత్రి సీతక్క జన్మదినం సందర్భంగా వెంకటాపూర్ మండలంలోని ఎల్లారెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలు పంపిణీ చేసినట్లు ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి తెలిపారు. సీతక్క జన్మదిన వేడుకలను పిల్లలతో జరుపడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాజేష్, ఎనబోతుల తిరుపతి, బోయిని సుదాకర్, తదితరులు పాల్గొన్నారు.

● తాడ్వాయి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క జన్మదిన దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షురాలు రేగ కళ్యాణి మంగళవారం కామారం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, కంపాక్స్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు.

ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు కొర్నిబెల్లి కవిత, సావిత్రి, రేగ అనిల్, ఆనంద్, అశోక్, సందీప్, విజయ్, లక్ష్మణ్, సందీప్, శశికాంత్, తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మేడారం : తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఎనగంటి రామయ్య తల్లి ముత్తమ్మ నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు.

ఘనంగా సీతక్క జన్మదిన వేడుకలు

గోవిందరావుపేట, జూలై 9: మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా బస్టాండ్ సమీపంలో వెంకటకృష్ణ కేక్ కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలలో నాయకులు కణతల నాగేందర్, సీతారాంనాయక్, జెట్టి సోమయ్య, పెండెం శ్రీకాంత్, కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, తేళ్ల హరిప్రసాద్, చింత క్రాంతి, జంపాల ప్రభాకర్, సుధాకర్, తదితరులు పాలొన్నారు.

● కన్నాయిగూడెం : మంత్రి దనసరి అనసూయ సీతక్క పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎం.డి. అప్సర్ పాషా, మండల ఇన్‌చార్జి జాడి రాంబాబు ఆధర్యంలో ఘనంగా జరిగాయి. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అబ్బు రమేష్, తాటి రాజబాబు, బోట నగేష్, సునార్కని రాంబాబు, గడ్డం నాగేష్, బొల్లె భాస్కర్, చీదారి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

● మంగపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సీతక్క జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. మంగపేటలోని కాంగ్రెస్ కార్యాలయం మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేక్‌ను కట్‌చేశారు. సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు.

కస్తూర్బా అనాథ వృద్ధాశ్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమూద్, నూకల రాజేష్ ఆధ్వర్యంలో అన్నదానంతో పాటు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో పండ్లు, బ్రెడ్స్, కేక్ పంపిణీ చేశారు. గ్రామాల్లో దేవాలయాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. సీతక్క ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కాంక్షించాచు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి గాజర్ల రాజుమాదిగ ఏటూరునాగారం సామాజిక వైద్యశాలలో రక్తదానం చేశారు.

ప్రకృతిని కాపాడుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కాకతీయఖని, జూలై 9: ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి ప్రకృతిని కాపాడుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం చెల్పూరు రేంజ్ పరిధిలోని ఎకో పార్క్‌లో రేంజ్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరె, సీసీఎఫ్ ప్రభాకర్, జిల్లా అటవీశాఖ అధికారి వసం తతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లా డుతూ గతంలో పెద్ద పెద్ద వృక్షాలు ఉండేవని, చల్లని నీడను ఇచ్చే చెట్లు ఇప్పుడు కనిపించడం లేవన్నారు. భవిష్యత్ తరాల కు మంచి జరగాలంటే ఇప్పటి నుంచే మొక్కలను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, రేంజ్ అధికారులు నరేష్ బస్వ, ఆసిఫ్ అలీ పాల్గొన్నారు.

వీఆర్‌వోల వినతి

భూపాలపల్లిటౌన్: తమ డిమాండ్లను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు భూపాలపల్లి జిల్లా వీఆర్‌వోల సంఘం నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఇనుగాల కృష్ణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను రద్దుచేసి జీవో 121 ద్వారా వివిధ డిపార్ట్‌మెంట్లలోకి సర్దుబాటు చేసిందని అన్నారు. దీంతో వీఆర్‌వోల ఉద్యోగ భవిష్యత్ అందకారంలోకి నెట్టివేయబడిందన్నారు. వీఆర్‌వోలందరికీ సర్వీస్ ప్రొటక్షన్, పే ప్రొటెక్షన్ లేకుండా పోయిందన్నారు. కొందరికి వేతనాలు రావడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమను తిరిగి రెవెన్యూ వ్యవస్థకు తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పద్మ, వెంకటస్వామి, నారాయణ, చంద్రమోహన్, శ్రీనివాస్, హన్మంతు, అశోక్, రంజిత్, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

రేగొండ, జూలై 9: ఇటీవల వివిధ కారణాలతో మరణించిన రంగయ్యపల్లి, కోటంచ, కనిపర్తి గ్రామాలకు చెందిన దేశిని మల్లయ్య, కూనాడి ఉమాదేవి, శ్రీపతి శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు దగ్గు వెంకన్న, బండి రమేష్ తదితరులు ఉన్నారు.

వాడబలిజ సేవా సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక

వాజేడు, జూలై 9: వాడ బలిజ సేవా సంఘం మండల అధ్యక్షుడిగా మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన గార నాగార్జునరావు, ఉపాధ్యక్షుడిగా సుగంధం సాంబశివరావు ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డర్రా దామోదర్ ప్రకటించారు. వాజేడు, పేరూరు ఎస్సైలుగా బాధ్యతలు స్వీకరించిన రుద్రారపు హరీశ్ గుర్రం కృష్ణప్రసాద్‌ను కలిసి సత్కరించారు.

వాగులో చిక్కుకున్న యువకులు

(5వ పేజీ తరువాయి)

వైపు వారు చిక్కుకున్నారు. వాగు దాటలేక భయాందోళన చెందిన ఆ యువకులు 100కు ఫోన్ కాల్ చేశారు. సమాచారాన్ని అందుకున్న ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీనివాస్ మంగపేట పోలీసులు, రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి సమాచారం ఇచ్చారు. దీంతో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు ట్రాక్టర్‌పై అక్కడికి వెళ్లి ఇద్దరు యువకులను సురక్షితంగా వాగు దాటించి తీసుకొచ్చారు. తమ పిల్లలు క్షేమంగా తిరిగి రావడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


లక్ష్మణ్ మృతదేహం

ఏటూరునాగారం రూరల్, జూలై9: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో సోమ వారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై తాజుద్దీన్ తెలి పిన వివరాల ప్రకా రం.. మంగపేట మండలం కమలాపురానికి చెందిన తురుక లక్ష్మణ్(19) అదే గ్రామానికి చెందిన బత్తుల ఉప్పలయ్య భూపాలపల్లికి బైక్‌పై బయల్దేరారు. పనులు ముగిం చుకొని తిరిగి స్వగ్రామానికి వస్తున్న క్రమంలో ఉప్పల య్య ద్విచక్రవాహనాన్ని అతివేగం, అజాగ్రత్తగా నడుపుకుంటూ రావడంతో మండలంలోని చిన్నబోయి నపల్లి వద్ద అది అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో లక్ష్మణ్ తలకు తీవ్ర గాయాలై అక్కడి కక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి తురుక భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తలిపారు.

ఎస్సై మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్


మాట్లాడుతున్న మోహన్

కాళోజీ జంక్షన్, జూలై 9 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారా వుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ మృతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేదాసి మోహన్ డిమాండ్ చేశారు. హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితుడైన ఎస్సై శ్రీనివాస్‌ను స్టేషన్ సీఐ మరికొందరు పోలీసులు వేధింపులకు గురిచేయడం వల్ల మనస్థాపం చెంది పురు గుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మోహన్ ఆరోపిం చారు. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రస్తుత సమాజంలో కూడా ఇంకా కుల వివక్ష కొనసాగుతూనే ఉందనడానికి ఎస్సై ఆత్మ హత్య నిదర్శనమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్ర తల పరిరక్షణ కోసం పాటుపడే ఉద్యోగంలో చేరిన శ్రీనివాస్‌ను ఆత్మహత్య చేసుకునే విధంగా వేధించిన కారకులందరికి కఠిన శిక్షప డే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని మోహన్ ప్రభు త్వాన్ని కోరారు. విలేకరుల సమావేశంలో ఇంకా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలుమారి బాలస్వామి, నాయకులు కందుకూరి భాస్కర్, ఎం.సుమన్ పాల్గొన్నారు.

మోతాదుకు మించి మాత్రలు మింగి ఆత్మహత్య


శివరామకృష్ణ (ఫైల్)

చిట్యాల, జూలై 9: మోతాదుకు మించి మాత్రలు వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... చల్లగరిగ గ్రామానికి చెందిన పినగాని రాజేందర్, సుజాత దంపతులకు కుమారుడు శివరామకృష్ణ (34)తోపాటు కుమార్తె ఉన్నారు. శివరామకృష్ణకు హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గ్రామానికి గూనిపర్తి గ్రామానికి చెందిన కూచన మారుతితో 2017లో వివాహం జరిగింది. శివరామకృష్ణ వికారాబాద్ జిల్లా తాండూరులో ఓ స్వచ్ఛంద సంస్థలో పనిచేసేవాడు. 2020లో శివరామకృష్ణకు పక్షవాతం వచ్చింది. దీంతో హనుమకొండలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ఆరోగ్యం కుదుటప డకపోవడంతో స్వగ్రామంలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యుల మధ్య గొడవలు జరగాయి. దీంతో మారుతిని ఆమె కుటుంబ సభ్యులు పుట్టింటికి తీసుకెళ్లారు. గత ఏడాది డిసెంబర్‌లో శివరామకృష్ణతో మారుతి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించింది. ఇటీవల రెండుసార్లు కోర్టుకు హాజరైన శివరామకృష్ణ కొద్దిరోజులుగా మనస్తాపం చెందాడు. ఈనెల 10న కోర్టులో హాజరు కావాల్సి ఉండగా సోమవారం రాత్రి మోతాదుకు మించి మాత్రలు వేసుకున్నాడు. ఉదయం కుమారుడి గదికి వెళ్లిన రాజేందర్ చిరిగి ఉన్న మాత్రల కవర్లు కనిపించాయి. అపస్మారక స్థితిలో పడి ఉన్న కుమారుడిని చూసి బోరున విలపించాడు. 108కు ఫోన్ చేసి ఆలస్యమవుతుందని ప్రైవేటు వాహనంలో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగానే శివరామకృష్ణ మృతి చెందాడు. తమ కుమారుడి మృతికి అతడి మామ కూచన నర్సింగం, భార్య మారుతి, అత్త లక్ష్మి, బావమరిది రాజేంద్రప్రసాద్ కారణమని రాజేందర్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నేడు కడియం కావ్య విజయోత్సవ సభ

భూపాలపల్లిటౌన్, జూలై 9: వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య విజయోత్సవ సభను బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తోట రంజిత్ ఒక ప్రకటనలో తెలిపారు. మంజూర్‌నగర్ సమీపంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్యే గండ్ర సత్యానా రాయణరావు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు, పార్టీ అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మండల ప్రత్యేక అధికారిగా శామ్యూల్



రేగొండ, జూలై 9: మండల ప్రత్యేక అధికారిగా జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శామ్యూల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారిగా శామ్యూల్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపీడీవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు

మహదేవపూర్, జూలై 9: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాధనంతో శ్రీపాదరావు విగ్రహం ఏర్పాటు విషయంలో ఎంపీడీవోపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మకు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, నాయకులు వెన్నపురెడ్డి మోహన్‌రెడ్డి, అలీంఖాన్ ఈ మేరకు వెల్లడించారు. ప్రజాభిప్రాయం లేకుండా విగ్రహవిష్కరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు.

ప్రభుత్వ స్థల పరిరక్షణకు చర్యలు

కాటారం, జూలై 9:మండలకేంద్రం శివారులో 353(సీ) జాతీయరహదారి పక్కన సర్వే నెంబర్ 41లో గల ప్రభుత్వ భూమి పరిరక్షణకు రెవెన్యూ అధికారులు చర్యలు మంగళవారం చర్యలు చేపట్టారు. అట్టి భూమిలో కొంతభాగం కొందరు అక్రమార్కులు రెండు రోజుల క్రితం దున్నిన విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ నాగరాజు పరిరక్షణ కోసం చర్యలు చేపట్టారు. ఆర్ఐ వెంకన్న రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత్రికేయు ల ఇళ్ల స్థలాల కోసం ప్రతిపాదించిన భూమి రక్షణకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

సింగరేణిలో కార్డ్ సిస్టమ్‌ను తొలగించాలి

కాకతీయఖని, జూలై 9: సింగరేణి యాజమాన్యం ఇటీ వల ప్రవేశ పెట్టిన ఎల్లో, రెడ్ కార్డ్ సిస్టాన్ని వెంటనే తొల గించాలని కేటీకే-5వ గని ఏఐ టీయూసీ పిట్ సెక్రటరీ దోర్నాల తిరుపతి డిమాండ్ చే శారు. ఈ మేరకు మంగళ వారం గని మేనేజర్ జాకీర్ హుస్సేన్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణమూర్తి, శ్రీకాంత్‌రెడ్డి, అఖిల్‌కుమార్, తిరుపతిరెడ్డి, రామన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనుల ప్రారంభం


బీటీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నేతలు

చిట్యాల, జూలై 9: మండలంలోని చల్లగరిగ గ్రామం శివారు నుంచి రేగొండ మండలం కొడవటంచ వరకు బీటీ రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు మండలాల ప్రజల ఆకాంక్ష మేరకు ఈ పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు రూ. 1.70 కోట్లు మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ తెలిపారు. ఈకార్యక్రమంలో చిలుకల రాయకొమ్రు, బొజ్జం వేణు, దేవేందర్, మేకల శ్రీనివాస్, ఆకుల సుధాకర్, మూల రమేష్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షురాలిగా రాజేశ్వరి

ములుగు రూరల్ జూలై 9: పీఆర్‌టీయూజిల్లా ఉపాధ్యక్షురాలుగా బానోతు రాజేశ్వరి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి మన్నె చంద్రయ్య, జిల్లా అధ్యక్షుడు తాడిచర్ల రవి, ప్రధాన కార్యదర్శి రామన్న నాయక్ చేతుల మీదుగా ఆమె మంగళవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ములుగులోని కస్తూర్బా విద్యాలయంలో రాజేశ్వరి హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

బీజేపీ, కిసాన్ మోర్చా నాయకులు

ములుగు కలెక్టరేట్, జూలై 9: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నిక లకు ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చా లని డిమాండ్ చేస్తూ బీజేపీ, కిసాన్‌మోర్చా నాయకులు మంగళవారం స్థానిక తహ సీల్దార్ కార్యాలయంలో అధి కారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేయాలని, రైతుభరోసా కింద ప్రతి ఎకరాకు రూ.15వేల ఆర్థిక తోడ్పాటు అందించాలని, కౌలురైతులకు ఆర్థికసాయం అందించాలని, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందించాలని, రాష్ట్రంలో పసల్‌బీమా యోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి బాబు, కృష్ణాకర్, రవింద్రచారి, మహేందర్, రవిరెడ్డి, గాధం కుమార్, మహేందర్, పాపిరెడ్డి, హేమాద్రి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపురం(నూగూరు): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు తోట సతీష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదని అన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ ఏకకాలంలో అమలు చేయాలని, రైతుభరోసా కింద ఎకరాకు రూ.15వేలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షడు అట్లూరి రఘురాం, నాయకులు విజయ్, హేమసుందర్‌రాజు, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

వాజేడు, జూలై 9: మలేరియాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ అధికారి డాక్టరు సునీల్ కుమార్ అన్నారు. వరంగల్ నుంచి వచ్చిన ఆయన మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో జ్వరంతో చికిత్స పొందుతున్న రోగి వివరాలను అడిగి తెలుసుకున్నారు. గతనెలలో మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణ జరిగిన పెనుగోలు కాలనీకి చెందిన మునిక మంగా ఇంటిని సందర్శించారు. గ్రామాలలో పిచికారీ చేసిన దోమల మందు గురించి ఆరా తీశారు. అదే గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న వ్యక్తికి పరీక్షలు జరిపించారు. ఆయన వెంట జోనల్ అసిస్టెంట్ ఆఫీసర్ నాగయ్య, ఎల్‌టీ మురళీ, ఎంఎల్‌హెచ్‌పీ జ్ఞానస, హెచ్ఎస్‌లు కోటిరెడ్డి, వెంకటరమణ, ఏఎన్ఎం రాజేశ్వరి తదితరులు ఉన్నారు.